సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 24 । అక్టోబర్ । 2024



హత్యాయత్నం కేసు మమ!

కడప నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి హత్యాయత్నం కేసును చిన్నచౌక్ పోలీసులు మమ అన్పించారు. -8లో



సమాజ శ్రేయస్సే ముఖ్యం

తమ పరిశ్రమ కేవలం వ్యాపారం మాత్రమే చేయడం లేదని, సమాజ శ్రేయస్సుకూ కృషి చేస్తోందని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎంఓ రమేష్ తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.2/24.6

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.6 – 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఆరు మండలాల్లో వర్షం

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో ఆరు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా దువ్వూరులో 10.2 మిల్లీమీటర్ల వర్షం కురవగా రాజుపాలెంలో 8, బద్వేల్‌లో 5.2, చెన్నూరు, వేములలో 1.6, గోపవరంలో 0.8 మి.మీ వర్షం కురిసింది.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా శ్రీనివాసమూర్తి



కడప కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా కె. శ్రీనివాస మూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసమూర్తి ఇదివరకు రెండు సార్లు ఏపీఐఐసీకి జోనల్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జెడ్‌ఎంకు ఏపీఐఐసీ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు శుభాకాంక్షలు తెలిపారు.

నవంబర్ 11లోపు ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన నిర్దేశిత ఫీజును నవంబర్ 11వ తేదీలోపు చెల్లించాలని ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇంటర్ ఫీజుకు సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా నవంబర్ 11లోపు చెల్లించవచ్చని తెలిపారు. అపరాధ రుసుము రూ.1000 తో నవంబర్ 12 నుంచి నవంబర్ 20 వరకు చెల్లించవచ్చని చెప్పారు. అలాగే మొదటి లేదా రెండో ఏడాది జనరల్ థియరీ సబ్జెక్టులకు రూ 600, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్‌కు రూ.275 చెల్లించాలని తెలిపారు. అలాగే ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం బ్రిడ్జ్ కోర్స్ సబ్జెక్టులకు రూ.165 చొప్పున చెల్లించాలి చెప్పారు. అలాగే ప్రథమ ,ద్వితీయ సంవత్సరాల జనరల్ పరీక్షలకు రూ. 1200 చెల్లించాలని వెల్లడించారు.

నేనున్నా..

- బాధిత కుటుంబానికి భరోసా కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- బద్వేలు పర్యటనలో జననేతకు జనం అడుగడుగునా నీరాజనం
- అభివాదం చేస్తూ ముందుకు సాగిన జగన్

బద్వేలు అర్బన్/గోపవరం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు కొండంత భరోసా కల్పించారు. కూటమి ప్రభుత్వంలో అరాచకం రాజ్యమేలుతోందని.. ఆడబిడ్డలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. ఎవరూ అధైర్యపడాల్సిన పని లేదని బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. బద్వేలు పట్టణంలో ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బుధవారం ఆయన బద్వేలుకు వచ్చారు. గోపవరం మండలం పి.పి.కుంట సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగిన అనంతరం రోడ్డు మార్గాన బద్వేలుకు చేరుకున్నారు. దారి పొడవునా ప్రజలు, అభిమానులు జననేతను చూసేందుకు ఉత్సాహం చూపారు. ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలతో జగన్‌మోహన్‌రెడ్డి సైతం తన వాహనాన్ని ఆపి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం పట్టణంలోని రామాంజనేయనగర్‌లో ఉన్న దస్తగిరమ్మ ఇంటి వద్దకు చేరుకున్నారు.

బాధిత కుటుంబానికి కొండంత భరోసా

దస్తగిరమ్మ ఇంటికి చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డి తొలుత దస్తగిరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యు లను పరామర్శించారు. అనంతరం దస్తగిరమ్మ తల్లిదండ్రులైన హుస్సేనయ్య, హుస్సేనమ్మలతో పాటు మేనమామతో మాట్లాడారు. ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకొని వారిని ఓదార్చారు. తానున్నానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, ఆర్.రమేష్‌యాదవ్, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఓ.రసూల్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, బద్వేలు నియోజక వర్గ కన్వీనర్ల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



దస్తగిరమ్మ కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తనను చూసేందుకు వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జనసంద్రం

బద్వేల్: (వ్యవసాయం): 'కూటమి ప్రభుత్వంలో అరాచకాలు ఎక్కువయ్యాయి.. ఆడబిడ్డలకు రక్షణ కరువైంది.. ఇక నువ్వే దిక్కు.. జగనన్నా..' అంటూ జనం నినదించారు. దస్తగిరమ్మ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ముఖ్యమంత్రి, వైయస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి కాన్వాయ్ అక్కడకు చేరుకునేసరికి రామాజనేయ నగర్ నలు వైపుల వీధుల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. కారులో నుంచి దిగిన జగన్ జనం వైపు చూస్తూ.. అభివాదం చేస్తూ దస్తగిరమ్మ ఇంటిలోకి వెళ్లారు.వారిని పరామర్శించిన అనంతరం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నాలుగు నెలల కూటమి పరిపాలనలో ఎన్నో దారుణాలు జరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు.ఆడబిడ్డల రక్షణ కోసం ఏర్పాటు చేసిన దిశ చట్టాన్ని నీరుగార్చడంపై ధ్వజమెత్తారు.

అంధుల జీవితంలో వెలుగు రేఖలు

- అంధుల ఉన్నత పాఠశాలలో విద్యాబోధనకు 75 ఏళ్లు
- 25న వజ్రోత్సవ వేడుకలు

కడప ఎడ్యుకేషన్: ఎందరో అంధులకు అక్షరాలను నేర్పుతూ వారి జీవితంలో వెలుగు రేఖలు నింపుతూ వస్తున్న అంధుల పాఠశాల వజ్రోత్సవాలకు సిద్ధమవుతోంది. 1949లో కడప పట్టణంలో ఒక అంధ ఉపాధ్యాయుడు ఒక అంధ విద్యార్థితో ప్రారంభమైన అంధుల పాఠశాల ఎందరో జీవితాల్లో వెలుగులను నింపి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దింది. ఈ నేపథ్యంలో ఈ నెల 25న వజ్రోత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు పాఠశాల యాజమాన్యంతో పాటు అధికారులు సిద్ధమవుతున్నారు.

అంధ్రప్రదేశ్‌లో ఏకైక పాఠశాల...

ఆంధ్రప్రదేశ్‌లో 1949లో ఏకైక ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాల కడప నగరంలోని శంకరాపురంలో ఏర్పాటయింది. పదో తరగతి వరకు ఎలాంటి ఫీజు లేకుండా ఉచిత చదువుతోపాటు ఉచిత భోజనం, ఉచిత వసతులను కూడా కల్పించి బోధనలను అందిస్తున్నారు. ఈ అంధుల పాఠశాలలో విద్యనభ్యసించిన దాదాపు 6 వందల మంది అంధులు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేస్తుండడం విశేషం.



పాఠాలను బోధిస్తున్న ఆకుల రాజా

ప్రస్తుతం 53 మంది విద్యార్థులతో...

రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన 53 మంది అంధ విద్యార్థులు ప్రస్తుతం 1 నుంచి 5వ తరగతి చదువుతున్నారు. వీరికి పాఠ్యాంశాలు బోధించేందుకు 14 మంది టీచర్లతోపాటు ఒక ప్రధానోపాధ్యాయుడు పనిచేస్తున్నారు. 2023–24 విద్యాసంవత్సరంలో పదవ తరగతికి సంబంధించి నలుగురు విద్యార్థులు ఉండగా వారంతా పాసై వందశాతం ఉత్తీర్ణతను సాధించారు. దీంతోపాటు పాఠశాలకు చెందిన శర్వానందరెడ్డి అనే విద్యార్థి కాస్ లెస్ ఫ్యూయల్(వాటర్ కారు) ను తయారు చేసి జిల్లాస్థాయి సైన్సు ప్రోగ్రాంలో కన్సొలేషన్ ప్రైజ్ కింద రూ.1000 నగదు, మెమెంటోను సాధించాడు. అలాగే రాష్ట్రస్థాయి సెమినార్‌లోను శర్వనందరెడ్డి బహుమతిని సాధించాడు.

ఇంటర్ కళాశాల అప్‌గ్రేడ్ కోసం..

కడపలోని అంధుల ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్ కోసం గతంలో హెడ్ మాస్టర్‌గా పనిచేసిన శంకరయ్య ఎంతో కృషి చేశారు. త్వరలో ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో ఇంటర్ కళాశాలకు అనుమతి రానుంది.


ఇక్కడే చదివి ఇక్కడే ఉపాధ్యాయులుగా....

చక్రధర్‌రెడ్డి, నరసింహులు, అకుల రాజా అనే ఉపాధ్యాయులు 1 నుంచి 10వ తరగతి వరకు అక్కడే చదివారు. తరువాత వారు బయట ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.



అంధుల పాఠశాల ముఖద్వారం

ఓ ప్రధానోపాధ్యాయుడి సహకారంతో...



వెంకటరత్నం

పశ్చిమ గోదావరి జిల్లా రాజమహేంద్రవరం(రాజమండ్రి)కి చెందిన వెంకటరత్నం అనే ప్రధానోపాధ్యాయుడు 1949 అక్టోబర్ 25వ తేదీన కడపకు వచ్చారు. ఈ క్రమంలో కడపకు చెందిన కామిశెట్టి వెంకటేశంశెట్టి, దర్మపత్ని కామిశెట్టి బాలమ్మల సహకారంతో పాఠశాల కోసం ఎకరా 50 సెంట్ల స్థలాన్ని సేకరించి కడప శంకరాపురంలో ఒక చిన్న గుడిసెలో ప్రభుత్వ అంధుల పాఠశాలను స్థాపించారు. అప్పట్లో ఆదోనికి చెందిన లక్షన్న అనే విద్యార్థి వచ్చి మొదటి విద్యార్థిగా పాఠశాలలో చేరి విద్యనభ్యసించారు. ఆ లక్షన్న తమ విద్యా భ్యాసా న్ని అక్కడే పూర్తి చేసి అక్కడే ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఎందరో అంధ విద్యార్థులకు సేవలందించారు. ఆపై దాతలు, ప్రభుత్వం, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు అందరూ సంయుక్తంగా అంధుల ఉన్నత పాఠశాలను అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల బ్యాంకు ఖాతాలో దాతల విరాళాలు రూ. 5 లక్షల వరకు ఉన్నట్లు తెలిసింది.



అంధుల ఉన్నత పాఠశాల స్థల దాతలు

ఏర్పాట్లు చేస్తున్నాం



ఈ నెల 25,26 తేదీలలో అంధుల పాఠశాలలో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాటు చేస్తున్నాం. పాఠశాల భవనాలకు రంగులు వేయడం తదితర ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులతోపాటు ఉన్నతాధికారులు, దాతలను ఆహ్వానించాం.

– ఎబినేజర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, అంధుల ఉన్నత పాఠశాల

గమ్యం చేరని ప్రయాణం

- పులివెందుల సమీపంలో లోయలో పడిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు
- ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదం

పులివెందుల రూరల్: మరికొద్ది నిమిషాల్లో వారంతా గమ్యం చేరుకుంటారు. అంతలోనే ఉన్నట్టుండి హాహాకారాలు.. ఏమైందో తెలియలేదు. మెల్లగా తేరుకునేలోపు బస్సు పెద్ద లోయలో పడిపోయి ఉంది. రక్షించే వారి కోసం ప్రయాణికులంతా కేకలు వేస్తున్నారు. అతి వేగం.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో జరిగిన పొరపాటు.. వెరసి ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేశాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల వద్ద బుధవారం బస్సు లోయలో పడిన సంఘటనలో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది. కదిరి నుంచి పులివెందులకు వస్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు నామాలగుండు దాటుకొని పురపాలక డంపింగ్ యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కనే ఉన్న దాదాపు 30 అడుగుల లోయలో పడిపోయింది. డీఎస్పీ మురళీ నాయక్, సీఐ జీవన్ గంగానాథ్‌లు క్షతగాత్రులను వెంటనే 108 వాహనం ద్వారా పులివెందుల వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్ గంగిరెడ్డి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్టు తెలుస్తోంది. బస్సులోని ప్రయాణికుల్లో కొందరికి చేతులు విరగ్గా, మరి కొందరికి నడుములు విరిగాయి. కండక్టర్ నీరదామణికి నడుము వద్ద ఎక్కువగా నొప్పి ఉండడంతో ఆమెకు చికిత్స చేస్తున్నారు. కదిరికి చెందిన షేక్ షావూర్ జషాకు ఎడమ చేయి విరిగింది. ముదిగుబ్బకు చెందిన వెంకట శివమ్మకు భుజం విరిగింది.



చికిత్స పొందుతున్న కండక్టర్ నీరదామణి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీఓ భానుశ్రీ

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్సీ

పులివెందుల – కదిరి రోడ్డు మార్గంలో ఆర్టీసీ బస్సు లోయలో పడిన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

మున్సిపల్ చైర్మన్ పరిశీలన

మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిశోర్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు.

మెరుగైన వైద్యం అందించండి

బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పులివెందుల ఆర్డీఓ భానుశ్రీ, తహసీల్దార్ నజీర్ అహమ్మద్, ఆర్టీసీ ఆర్‌ఎం గోపాల్ రెడ్డి, ఆర్టీసీ డీఎం ప్రవీణ్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు వైఎస్సార్ సర్వజన ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరిని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

కార్తీక మాసానికి ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో వివిధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం, మహానంది, అరుణాచలం తదితర క్షేత్రాలకు భక్తులు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పౌర్ణమి సందర్భంగా తిరువన్నామలైలోని అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేశామన్నారు. భక్తులు బృందాలుగా శైవ క్షేత్రాలు, విహార యాత్రలకు వెళ్లాలనుకుంటే వారికి అద్దె ప్రాతిపదికన బస్సులు బాడుగకు ఇస్తామన్నారు. ప్రత్యేక బస్సుల కోసం ఆయా డిపోల మేనేజర్లు 99592 25774 (కడప), 99592 25779 (బద్వేలు), 99592 25781 (మైదుకూరు), 99592 25780 (పులివెందుల), 99592 25777 (ప్రొద్దుటూరు), 99592 25778 (జమ్మలమడుగు)లను సంప్రదించాలని సూచించారు.

బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



బెటాలియన్‌లోని ఆయుధాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సిద్దవటం: మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ థియోఫిలాస మాట్లాడుతూ బెటాలియన్‌లో ఉన్న ఆయుధాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శించామన్నారు. వాటి పనితీరుపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ విల్సన్‌కేర్ పాల్గొన్నారు.

అన్నదాతపై నిర్లక్ష్యమేల!

- కరువు మండలాలు ప్రకటించాలి
- ముంపు భూముల్ని దాల్మియా కొనాలి
- అన్నమయ్య డ్యాం పనులు ప్రారంభించాలి
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల డిమాండ్

కడప సెవెన్‌రోడ్స్: ఖరీఫ్‌లో కరువు, ఇటీవల తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం సరికాదని.. అన్నదాతలను ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. కరువు మండలాలను ప్రకటించి అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జేష్టాది శారద అధ్యక్షతన జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది.



జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి



ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

- వ్యవసాయశాఖపై జరిగిన సమీక్షలో సీకే దిన్నె జెడ్పీటీసీ రామాంజులరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద నిధులు విడుదల చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ. 20 వేలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ మొత్తంలో కేంద్ర వాటా ఎంతో, రాష్ట్ర వాటా ఎంతో తెలపాలన్నారు. దీనికి జేడీఏ నాగేశ్వరరావు బదులిస్తూ విధి విధానాలు తయారవుతున్నాయని చెప్పారు. నవంబరులో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి అన్నదాత సుఖీభవ కింద నిధులు విడుదల చేస్తామని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు.





మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ జేష్టాది శారద, చిత్రంలో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్.. హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా అధికారులు



ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

- ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ విత్తనాల కంటే బహిరంగ మార్కెట్‌లోనే ధర తక్కువ ఉందని, ఇందువల్ల రైతులు నష్టపోయారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి విమర్శించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తక్కువ ధరతో సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.
- తుపానులో వరి పంట దెబ్బతిందని, ఎన్యుమరేషన్ చేయించి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పించాలని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు.



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

- వ్యవసాయాధికారులు గ్రామాలకు వెళ్లడం లేదని, జీలుగ, పిల్లిపెసర, శనగ విత్తనాలు ప్రభుత్వం ఎన్ని సరఫరా చేసిందన్న విషయాలను తమకు ఎందుకు తెలుపడం లేదని ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి ప్రశ్నించారు. రబీలో రైతులు సాగు చేసుకోవడానికి శనగ విత్తనాలు సరఫరా చేయాలని ఆయన కోరారు. యూరియా, పాస్ఫేట్ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు.
- పోరుమామిళ్ల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ దెబ్బతిన్న మినుము ఇతర పంటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సబ్సిడీ విత్తనాల సరఫరాతోపాటు నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకోవాలని వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి కోరారు.
- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ప్యాక్ హౌస్‌లు, ఫాంపాండ్స్, కలెక్షన్ సెంటర్లకు సంబంధించిన డబ్బులను రైతుల అకౌంట్లలో జమ చేయాలని కోరారు. చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డితోపాటు మరికొందరు సభ్యులు కరువు మండలాల ప్రకటన అంశాన్ని లేవనెత్తారు. ఇందుకు అధికారులు బదులిస్తూ ఐదు పారా మీటర్లలో మూడు అనుకూలిస్తే కరువు మండలాలను విపత్తుల నిర్వహణ విభాగం ప్రకటిస్తుందన్నారు. అన్నమయ్య జిల్లాలో 19–20 మండలాలు కరువు కింద ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలం తాళ్లమాపురంలో చేనేత కార్మికులు లేకపోయినా 50 మంది పెన్షన్ పొందుతున్నారని పేర్కొన్నారు.

ఉచిత కంటి అద్దాలు ఏవీ!



ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

వైద్య ఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ ఎల్వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కాంట్రాక్టు ఇచ్చిన తర్వాత పేదలకు ఉచిత కంటి అద్దాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఆస్పత్రుల్లో అప్తాామలజిస్టుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రాత్రి వేళల్లో వైద్య సిబ్బంది విధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి కోరారు. మధ్యాహ్నానికే పీహెచ్‌సీవైద్యులు ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి తెలిపారు. డెలివరీ కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేయడం వల్ల ఒక్కో కాన్పుకు రూ. 40–50 వేలు ఖర్చవుతోందన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

- ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య డ్యాం తెగిపోవడం వల్ల రాయచోటి, రాజంపేట, కోడూరు నియోజకవర్గాల ప్రజలకు తాగు, సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, వెంటనే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై సమావేశంలో తీర్మానం ఆమోదించి ప్రభుత్వానికి పంపాలని కోరారు.

ఎంఎస్‌ఎంఈ తరలింపు అన్యాయమే!

కొప్పర్తిలోని ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించిన అంశాన్ని సీకే దిన్నె జెడ్పీటీసీ రామాంజులరెడ్డి ప్రస్తావించారు. ఇందుకు పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ చాన్‌బాషా బదులిస్తూ తరలింపుపై జారీ చేసిన జీఓలో కారణాలు పేర్కొనలేదని తెలిపారు. తొలుత ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ గుంటూరుకు మంజూరైందని, భూమి లేకపోవడంతో కడపలో ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు దాన్ని అమరావతికి తీసుకు వెళ్లారని చెప్పారు. దీనిపై జెడ్పీటీసీ స్పందిస్తూ ఒకప్రాంతానికి ఒకసారి మంజూరు చేసిన ప్రాజెక్టును ఇతర ప్రాంతాలకు తరలించడం అన్యాయం కాదా? అంటూ ప్రశ్నించగా, పరిశ్రమలశాఖ జీఎం అవునని సమాధానమిచ్చారు. దీంతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి జీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్యాయమంటూ ఓ అధికారిగా ఎలా మాట్లాడుతారంటూ నిలదీశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, అన్నమయ్య జిల్లా డీఆర్వో సత్యనారాయణ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మైథిలి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

- ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మైలవరం మండలంలో దాల్మియా యాజమాన్యం వరద ప్రవాహానికి అడ్డంగా ఫ్యాక్టరీ నిర్మించిన కారణంగా వర్షాకాలంలో నీరు రైతుల పొలాలను ముంచెత్తుతోందన్నారు. దాల్మిక యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కైన ఫలితంగా రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. ముంపునకు గురవుతున్న సుమారు 600 ఎకరాల రైతుల పొలాలను దాల్మియా యాజమాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

మహిళ మృతి కేసులో జైలుశిక్ష, జరిమానా

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం బుడ్డాయపల్లెలో ఓ అద్దె ఇంటిలో నివాసముంటున్న తిరుపతికి చెందిన ఓ మహిళ మృతికి కారణమైన వ్యక్తికి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమార్ ఏడు సంవత్సరాల జైలుశిక్ష, రూ. 5 వేలు జరిమానా విధించినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో చిత్తూరు జిల్లా వి.కోట మండలం ఎల్లగరం గ్రామానికి చెందిన వెంకటేశ్‌ను నిందితుడిగా పేర్కొంటూ న్యాయమూర్తి తీర్పునిచ్చారన్నారు. కేసులో నిందితుడికి శిక్షపడటంలో కృషి చేసిన సీఐ సీతారామిరెడ్డి, పబ్లిక్‌ప్రాసిక్యూటర్ బాలాజీ, హెడ్‌కానిస్టేబుల్ గౌస్, కానిస్టేబుల్ రామయ్య, సుబ్బరాయులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు.

ఎగువపల్లెలో రోడ్డు ప్రమాదం

– వ్యక్తికి గాయాలు



ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టీడీపీ నాయకుడి వాహనం

లింగాల : లింగాల మండలం ఎగువపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు జగదీశ్వరరెడ్డి (జగ్గా) బొలేరో వాహనంలో వెళుతుండగా అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నారాయణస్వామి ద్విచక్రవాహనాన్ని బుధవారం ఢీకొట్టింది. ప్రమాదంలో నారాయణ స్వామి కాలు విరిగింది. గ్రామానికి చెందిన నారాయణస్వామి వైఎస్సార్‌సీపీ కార్యకర్త కావడంతో అతన్ని ఉద్దేశపూర్వకంగా వాహనంతో ఢీకొట్టారా, లేక ప్రమాదశాత్తు జరిగిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. దీనిపై ఎలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

గువ్వలచెరువు ఘాట్‌లో ఆయిల్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడిన ఆయిల్ ట్యాంకర్

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండలంలోని గువ్వల చెరువు ఘాట్ నాలుగో మలుపు వద్ద ప్రమాదవశాత్తు ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడింది. బుధవారం సాయంత్రం కడప వైపు వస్తూ ఆయిల్ ట్యాంకర్ (ఏపీ03 టీఈ9539) అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవర్ ప్రకాష్‌కు స్వల్పంగా, క్లీనర్ కుమారన్ కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన చింతకొమ్మదిన్నె పోలీసులు స్పందించారు. ఆయిల్ ట్యాంకర్‌కు ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శకటాన్ని తెప్పించి బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన మస్తాన్‌వలి

కలసపాడు : మండలంలోని సింగరాయపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఎగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన షేక్‌మస్తాన్‌వలి (28) బుధవారం సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కలసపాడుకు వచ్చి తిరుగు ప్రయాణంలో సింగరాయపల్లె వద్దకు రాగానే రెడ్డిపల్లె నుండి కలసపాడుకు వస్తున్న తుఫాన్ వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని స్వగ్రామం ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం పెద్దనాగులారం. మూడు సంవత్సరాల క్రితం ఎగువ తంబళ్ళపల్లె గ్రామానికి చెందిన షేక్‌కతిజాబీని వివాహం చేసుకున్నాడు. ఎనిమిది నెలల నుండి తన అత్తగారి గ్రామమైన ఎగువ తంబళ్ళపల్లెలో ఉంటూ బేల్దారి పని చేసుకుంటూ జీవించేవాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యాయత్నం కేసును మమ అన్పించారు..!

- రూ.30 లక్షలు తీసుకున్నాడని అభాండాలు వేయడంతోనే దాడి
- బాలిశెట్టి రవితేజతో చోటుచేసుకున్న అవమానాన్ని సీరియస్‌గా తీసుకున్న రౌడీషీటర్
- ఆ మేరకే శివకొండారెడ్డిపై దాడిగా ధ్రువీకరించిన చిన్నచౌక్ సీఐ తేజమూర్తి
- కోట్లాది రూపాయాలు తెలుగుతమ్ముళ్లు దండుకున్నారని ఫిర్యాదు మాటేమిటో?



అరెస్టు వివరాలు తెలియజేస్తున్న సీఐ తేజమూర్తి

సాక్షి ప్రతినిధి, కడప: కడప నగర సిటీ టీడీపీ అధ్యక్షుడు శివకొండారెడ్డి హత్యాయత్నం కేసును చిన్నచౌక్ పోలీసులు మమ అన్పించారు. ఐదు రోజులుగా విశేషమైన దర్యాప్తు చేపట్టి ఓ మైనర్‌తో కలిపి నలుగురు నిందితులుగా తేల్చారు. సీసీ ఫుటేజీలల్లో ఉన్న నిందితుల ఆధారంగా కొనసాగిన దర్యాప్తులో పోలీసులు ఘటనకు కారణం వెల్లడించడమే చాలా మందికి ఆశ్చర్యం తెప్పించింది. నిందితుడు బాలిశెట్టి రవితేజ ఓ రియల్టర్‌ను బెదిరించి రూ.30 లక్షలు తీసుకున్నారని సానపురెడ్డి శివకొండారెడ్డి ఫోన్‌లో వెరొకరికి చెప్పడంతో, అది తెలుసుకున్న రవితేజ మనస్థాపానికి గురైతే, స్నేహితుడైన రౌడీషీటర్ దీపక్ దాడి చేసినట్లు ముక్తాయింపు ఇచ్చారు. చిన్నచౌక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తేజమూర్తి ఆమేరకు మీడియాకు బుధవారం సాయంత్రం వెల్లడించారు.

రూ.30 లక్షలకే దాడి చేస్తే..

బాలిశెట్టి రవితేజ బెదిరించి ఓ రియల్టర్ నుంచి రూ.30లక్షలు తీసుకున్నారనే ఆరోపణకు ప్రతిఫలంగా నగర టీడీపీ అధ్యక్షుడుగా శివకొండారెడ్డిపై హత్యాయత్నం చోటుచేసుకుందని పోలీసులు వెల్లడించారు. మరీ కోట్లాది రూపాయాలను నాలుగు నెలల్లోనే కొల్లగొట్టారని ఏకంగా ఫిర్యాదు చేస్తే, ఏ స్థాయిలో దాడి ఉండాలన్నదే ప్రధాన ప్రశ్నగా నగర వాసులల్లో తొలుస్తోంది. తెలుగుతమ్ముళ్ల వ్యవహార్శైలిపై టీడీపీ అధిష్టానానికి 120 రోజుల పాలన నేపథ్యంలో 120 పేజీల ఫిర్యాదును అందజేశారు. స్వయంగా రాష్ట్ర మంత్రి నారాలోకేష్‌కు శివకొండారెడ్డి అందించారు. కడపలో టీడీపీనే నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నాయకుల్ని కాదని అనేక పార్టీల్లో పనిచేసిన వారికి అత్యధిక ప్రాధాన్యత దక్కుతోందని వివరించినట్లు సమాచారం. గత ప్రభుత్వ హాయాంలో కార్పొరేటర్‌గా పోటీ చేయాలని ఆదేశిస్తే బీ–ఫామ్ తీసుకెళ్లి అమ్ముకున్నోళ్లు కూడా ఇప్పుడు పెద్ద నాయకులుగా చలామణి అవుతూ భారీ దోపిడీకి పాల్పడుతున్నారని అందులో తెలిపినట్లు విశ్వసనీయ సమాచారం. ఆమేరకు 'కృష్ణలీలలు' 'రామకథలు' 'శివతాండవం' 'ద్వారకమయం' లాంటివన్నీ పూసగిచ్చినట్లు వెల్లడించినట్లు సమాచారం. టీడీపీ అధిష్టానం అవే ఫిర్యాదులను ముఖ్యనేతను ప్రశ్నించడం, ఫిర్యాదు ఎలా అందింది? ఎవరు చేశారు? అన్న విషయం తెలుసుకున్న తర్వాత హత్యాయత్నం ఘటన చోటుచేసుకున్నట్లు స్వయంగా తెలుగుదేశం వర్గీయులే అభిప్రాయపడుతున్నారు.

ఆదిలోనే ఉక్కుపాదం మోపితే...

కడప గడపలో ప్రత్యక్ష దాడులు సంస్కృతి చాలా తక్కువ. ప్రశాంత జీవనం సాగించాలనే వారే అధికం. ఆమేరకే భిన్నత్వంలో ఏకత్వంలా అన్నివర్గాలు, మతాల ప్రజలు కలిసిమెలసి జీవిస్తుంటారు. అలాంటి చోట ఇలాంటి ఘటనలపై ఆదిలోనే ఉక్కుపాదం మోపితే ప్రజాజీవనానికి తోడ్పాటుగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా శివకొండారెడ్డి కేసులో మోటివ్ పరిశీలిస్తే డొల్లతనం తేటతెల్లమైంది. బాధితుడు వాపోతే విన్న స్నేహితుడెళ్లి దాడి చేసినట్లుగా చెప్పుకరావడం విశేషం. ఇలాంటి ఘటనలు పట్ల భవిష్యత్‌లో మరింత కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

రియల్ ఎస్టేట్‌లో మనస్పర్థలతో దాడి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రియల్ ఎస్టేట్‌లో తలెత్తిన మనస్పర్థల కారణంగానే టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై దాడి చేశారని, ఈ ఘటనలో నలుగురిని అరెస్టు చేశామని చిన్నచౌకు సీఐ తేజమూర్తి తెలిపారు. బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న ఉదయం అప్సర సర్కిల్ సమీపంలో సానపురెడ్డి శివకొండారెడ్డిపై బాలశెట్టి రవితేజ, బొమ్మతోటి దీపక్, షేక్ మహమ్మద్ ఇంతియాజ్, షేక్ సమీర్ దాడి చేశారన్నారు. ఈ మేరకు వారిని కడప ఔటర్ రింగ్‌రోడ్డులో ఎస్ఐ రవికుమార్ అరెస్టు చేశారన్నారు. ప్రధాన నిందితుడైన బాలిశెట్టి రవితేజ, ఈ కేసులో ఫిర్యాదు దారుడు సానపురెడ్డి శివకొండారెడ్డి టీడీపీకి చెందిన వ్యక్తులుగా ఉంటూ ఇద్దరూ కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉండేవారని తెలిసిందన్నారు. ఇద్దరి మధ్య వచ్చిన మనస్పర్థల కారణంగా కొన్ని రోజుల క్రితం సానపురెడ్డి శివకొండారెడ్డి బాలిశెట్టి రవితేజకు ఫోన్ చేసి రవితేజ ఎవరో రియల్టర్‌ను బెదిరించి రూ.30 లక్షలు తీసుకున్నట్లు అభాండాలు వేశాడు. ఇందుకు మనస్థాపానికి గురైన రవితేజ ఈ కేసులో రెండవ ముద్దాయి, రౌడీషీటర్ అయిన తమ స్నేహితుడు దీపక్‌కు ఈ విషయం తెలియజేయడంతో దాన్ని సీరియస్‌గా తీసుకుని బొమ్మతోటి దీపక్ తన స్నేహితుడికి జరిగిన అవమానానికి సరైన గుణపాఠం తెలియజేయాలని భావించాడు. తన స్నేహితులైన షేక్ మహమ్మద్ ఇంతియాజ్, షేక్ సమీర్, జువైనల్‌తో కలిసి ముందుకు రెక్కీ నిర్వహించి ఇంటికి వెళుతున్న సానపురెడ్డి శివకొండారెడ్డిపై దాడి చేశారన్నారు.

దీపావళిని ఆనందంగా జరుపుకోవాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళిని జిల్లా ప్రజలందరూ ఆనందంగా, ఆహ్లాదకరంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాలులో దీపావళిని పురస్కరించుకుని బాణసంచా స్టాళ్ల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ డివిజన్‌లలో బాణసంచా దుకాణదారులకు లైసెన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ధ్వని కాలుష్య నియంత్రణకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన విధివిధానాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ ఒక్కరూ ఒక్క బాణసంచా దుకాణం నిర్వహించకూడదన్నారు. నిబంధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ఆర్డీఓలు వారంలోగా అన్ని బాణసంచా తయారీ గోడౌన్లను, స్టాళ్లను పరిశీలించి అనుమతులు ఉన్నవాటికి పర్మిషన్లు, పర్మిషన్ ముగిసిన స్టాళ్లకు రెన్యూవల్ చేయించే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, సాయి శ్రీ, భాను, కడప నగర కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ సాయి ధర్మా రావు, సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ గోపాల్ రెడ్డి, కడప తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఫైర్, రెవెన్యూ, పోలీసు, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతు ఆవేదనపై కలెక్టర్ కార్యాలయం ఆరా

–నివేదిక ఇవ్వాలంటూ తహసీల్దార్‌కు ఆదేశాలు



రైతు కొండారెడ్డిని విచారిస్తున్న రెవెన్యూ అధికారి మల్లికార్జున

మైలవరం: పొలం తగాదా విషయమై ఇరువురు లాయర్లతో మాట్లాడి న్యాయం చేస్తానని నమ్మబలికి బి.జంగాలపల్లెకు చెందిన రైతు నుంచి ఓ ప్రభుత్వ ఉద్యోగి డబ్బులు దండుకున్న వైనంపై జిల్లా కలెక్టర్ కార్యాలయ స్పందించింది. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను నివేదించాలంటూ మైలవరం తహసీల్దార్‌కు ఆదేశించారు. వివరాలలోనికి వెళ్లితే.. మైలవరం మండలం బి.జంగాలపల్లె గ్రామానికి చెందిన రైతు మునగాల వెంకటకొండారెడ్డి పొలం తగాదా విషయమై వాయిదా నిమిత్తం ప్రొద్దుటూరు కోర్టుకు వెళ్తుండేవాడు. ఈక్రమంలో అక్కడ పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి పరిచయమై ఇరువురు లాయర్లతో మాట్లాడి కేసును సెటిల్‌చేస్తానని నమ్మబలికి లక్ష 30వేల రూపాయలు నగదు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్న అతని నుంచి ఉలుకు పలుకులేదు. కేసును సెటిల్ చేయక పోగా తీసుకున్న డబ్బును ససేమిరా వెనక్కి ఇవ్వలేదు.దీంతో బాధిత రైతు తనకు న్యాయం చేయాలంటూ గత ఐదునెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఫలితం లభించలేదు. మోసం పోయిన రైతు ఆవేదనను ఈ నెల 19వతేదిన సాక్షి దినపత్రికలో 'నమ్మించాడు..నట్టేటముంచాడు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన కలెక్టర్ కార్యాలయం ఈ విషయపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదికను తమకు సమర్పించాలని తహసీల్దార్ లక్ష్మీ నారాయణను ఆదేశించారు. బాధిత రైతు కొండారెడ్డిని విచారించిన మైలవరం రెవెన్యూ అధికారులు ఇందుకు సంబంధించిన ఆధారాలను పొందుపరుస్తూ పూర్తి స్థాయి నివేదికను బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. కాగా ప్రైవేట్ వ్యవహారంలో తలదూర్చి రైతును మోసం చేసిన సదరుప్రభుత్వ ఉద్యోగిపై శాఖాపరంగా వేటుపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

వైవీయూ ఇన్‌చార్జి వీసీని తొలగించే వరకు పోరాటం

కడప ఎడ్యుకేషన్: లైగింగ వేధింపులకు పాల్పడిన యోగివేమన విశ్వ విద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి కృష్ణారెడ్డిని వెంటనే తొలగించాలని లేని పక్షంలో పోరాటాలు తీవ్రతరం చేస్తామని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి గంగా సురేష్, అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి వలరాజు హెచ్చరించారు. బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణారెడ్డిని తొలగించాలని వైవీయూను ముట్టడి చేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీగా మోహరించి అన్ని గేట్లకు తాళాలు వేసి ఆందోళనను అడ్డుకుని ఆందోళనకారులను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- పొన్నూరు విజయలక్ష్మి



మహిళా ఉద్యోగులతో ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ ఉమెన్ వింగ్ కమిటీ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ఏపీ జేఏసీ అమరావతి శక్తివంచన లేకుండా కృషి చేస్తోందని ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ ఉమెన్ కమిటీ స్టేట్ జనరల్ సెక్రటరీ పొన్నూరు విజయలక్ష్మి తెలిపారు. బుధవారం కడప నగరంలోని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి జనరల్ సెక్రటరీ కృష్ణకుమార్, కోశాధికారి శ్యామూల్ రొనాల్డ్ ఆధ్వర్యంలో ఏపీ జేఏసీ అమరావతి ఉమెన్ కమిటీ చైర్ పర్సన్ మేరి విజయకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతం మంది మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ వారి సమస్యల పరిష్కారానికి ఏ ఒక్క జేఏసీ ముందుకు రాలేదన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు నాయకత్వంలో ఏపీ జేఏసీ అమరావతి పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీతోపాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి జిల్లా కేంద్రాలలో కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లి అన్ని జిల్లాలలో మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కమిటీ స్టేట్ అసోసియేట్ చైర్ పర్సన్ సైకం శివకుమారిరెడ్డి మాట్లాడుతూ మహిళల ఇబ్బందులను తెలియజేసేందుకు అన్ని జిల్లాల కలెక్టరేట్లలో షీ బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని జిల్లాల్లో ఉమెన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్లను కలిసి విన్నవిస్తున్నామన్నారు. అనంతరం డివిజన్ స్థాయి ఉమెన్ కమిటీలను ఎంపిక చేశారు. కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉమెన్ కో చైర్ పర్సన్లు శారద, అనూరాధ, సెక్రటరీలు సుజాత, పద్మావతి, ప్రియాంక, శైలజ మాట్లాడారు. సమావేశంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, రామ్మూర్తి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాము, బాల వెంకటేష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగర పరిధిలో ఆర్కేనగర్‌కు చెందిన సుబ్బారావు అదృశ్యమైనట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. నగరంలోని ఎండీహెచ్ షోరూంలో స్టోర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న సుబ్బారావు ఈనెల 22వ తేదిదీన రోజులాగా విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదన్నారు. రిమ్స్ పోలీసుస్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది.

పాండిచ్చేరి అక్రమ మద్యం సీజ్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్/జమ్మలమడుగు : పాండిచ్చేరికి సంబంధించిన అక్రమ మద్యాన్ని తరలిస్తున్న శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 28.5 లీటర్లు కలిగిన 35 బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ గారి పర్యవేక్షణలో ఈఎస్ టాస్క్ ఫోర్స్, జమ్మలమడుగు ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారన్నారు. జమ్మలమడుగు ఇన్‌స్పెక్టర్ సరితారెడ్డి, ఎస్ఐ హుస్సేన్ బాషా, టాస్క్ ఫోర్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.కళ్యాణ్, కానిస్టేబుల్ అమరేశ్వర్, ఇతర సిబ్బంది జమ్మలమడుగు ప్రొద్దటూరు బైపాస్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా టీవీఎస్ జూపిటర్ వాహనంలో పాండిచ్చేరికి చెందిన 35 బాటిళ్లను తీసుకువెళుతున్న ధనిరెడ్డి శ్రీనివాసరెడ్డి అరెస్ట్ చేసి లిక్కర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే టీవీఎస్ జూపిటర్ వాహనాన్ని సీజ్ చేసి నిందితున్ని రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ కళ్యాణ్, కానిస్టేబుల్ అమరేశ్వర్‌ను కడప డీపీఈఓ అభినందించారు.

వైవీయూ అంతర్ కళాశాలల క్రీడల జట్టు ఎంపిక

- ఈ నెల 26, నవంబర్ 3వ తేదీన పోటీల నిర్వహణ

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా జట్టు ఎంపికలను ఈ నెల 26వ తేదీ, నవంబర్ 3వ తేదీలలో నిర్వహించనున్నట్లు వైవీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 26వ తేదీ కబడ్డీ క్రీడ జట్టు (మహిళలు, పురుషులు) ఎంపికలు, నవంబర్ 3వ తేదీన బెస్ట్ ఫిజిక్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్(మహిళలు, పురుషులు) అంతర్ కళాశాలల పోటీలు విశ్వ విద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్సు విభాగంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలు, పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు యోగివేమన విశ్వ విద్యాలయం అనుసంధానమైన కళాశాలల్లో అభ్యసించేవారై ఉండాలని తెలిపారు. వివరాలకు 9000294626, 9705459052 నెంబర్‌కు సంప్రదించాలని ఆయన తెలిపారు

సమాజ శ్రేయస్సే ముఖ్యం



కంటి వైద్యశాలను ప్రారంభిస్తున్న సీఎంఓ సాయి రమేష్

కమలాపురం: తమ పరిశ్రమ కేవలం వ్యాపారం మాత్రమే చేయడం లేదని, దానితో పాటు సమాజ శ్రేయస్సే ముఖ్యం అని, సమాజ సేవ పట్ల అంకిత భావంతో పని చేస్తున్నామని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక క్రాస్ రోడ్డు వద్ద బీసీసీపీఎల్ ఆర్థిక సహకారంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి పర్యవేక్షణలో నిర్వహించిన కంటి వైద్యశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే పలు చోట బస్ షెల్టర్లు, శుద్ధి నీటి కేంద్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డయాలసిస్, హిమో డయాలసిస్ సెంటర్లు, మరుగుదొడ్లు తదితరవి ఏర్పాటు చేశామన్నారు. అలాగే దత్తత గ్రామాల్లోని పాఠశాలల్లో ఫర్నీచర్‌తో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు మెరుగు పరిచామన్నారు.మండల ప్రజలు కంటి వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ చీఫ్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి,పేర్ల భార్గవ్ రెడ్డి, సీఎస్ఆర్ నీతేశ్వర్, పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ వేత్త విద్వాన్ వీఎం భాస్కర్ రాజు మృతి



విద్వాన్ భాస్కర్‌రాజు (ఫైల్)

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త విద్వాన్ భాస్కర్ రాజు (78) బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన తెలుగు పండితునిగా 35 సంవత్సరాలు పలు ప్రాంతాల్లో పనిచేసి 2010లో పదవీ విరమణ చేశారు. పద్య కవిగా పలు సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని అందరి మన్ననలు పొందారు. తబలా వాయించడం అభిరుచి కలిగిన ఆయన పలు హరికథలకు తబలా సహకారం అందించారు. రామలింగ శతకం, కవితా వినపం తదితర కవిత సంకలనాలను వెలువరించారు. ఈయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. భాస్కరరాజు మృతి పట్ల జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, సాహితీ వేత్తలు, అభిమానులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



మృతి చెందిన కమలమ్మ

చక్రాయపేట: మండలంలోని కుమార్లకాల్వ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలమ్మ(62)మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. కుమార్లకాల్వ హరిజనవాడకు చెందిన కమలమ్మ వేంపల్లెలోని తన కూతురు వద్దకు వెళ్లటానికి రోడ్డుపైకి వచ్చింది. ఆ సమయంలో వేంపల్లె వైపునకు టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో వెళుతున్న ఓ వ్యక్తిని లిఫ్ట్ అడిగి ఎక్కింది. కొద్ది దూరం వెళ్లే సరికి ఆటో వచ్చి స్కూటర్‌ను ఢీకొట్టడంతో కమలమ్మ కిందపడి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను వేంపల్లె వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త జయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనలపై కేసులు నమోదు

గాలివీడు : మండలంలోని నూలివీడు పంచాయతీ ఆవులరెడ్డివారిపల్లెకు చెందిన దేరంగుల ప్రమీల అస్తి తగాదాల విషయమై తన మామ చిన్నప్ప వారి బంధువులు ఐదుగురు కలసి తనను విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచారని ఫిర్యాదు చేసింది. అలానే గోరాన్ చెరువు పంచాయతీ ఆవుల శెట్టివారిపల్లెకు చెందిన మౌనిక తన కుమారుడితో కలసి మంగళవారం నుంచి కనబడలేదని భర్త మల్లేష్ ఫిర్యాదు చేయగాపై రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.